# సాక్షి యాదాద్రి భువనగిరి

శనివారం ; 6 ; ఏప్రిల్ ; 2024






**పోచంపల్లిలో కేంద్ర బృందం**

కేంద్ర అధికారుల బృందం పోచంపల్లిని సందర్శించింది. చేనేత వస్త్రాల తయారీ ప్రక్రియలను పరిశీలించింది. - IIలో



**కాంగ్రెస్ అసమర్థతతోనే కరువు**

కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతతోనే కరువు తీవ్ర పెరిగిందని మాజీ మంత్రి , ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి పేర్కొన్నారు. - IIలో

**రంజాన్ వేళలు**

ఇఫ్తార్ 6-36 (శనివారం సా॥)

సహర్ 4-43 (ఆదివారం ఉ॥)

## న్యూస్‌రీల్

### ఆత్మస్థైర్యం కోల్పోవద్దు



మాట్లాడుతున్న సైకాలజిస్ట్ ఎంఏ కరీం

భూదాన్‌పోచంపల్లి : విద్యార్థులు, యువత ప్రాథమిక దశ నుంచే ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని ముందుకెళ్లాలని తెలంగాణ సైకాలజికల్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్ సైకాలజిస్ట్ ఎంఏ కరీం సూచించారు. శుక్రవారం భూదాన్‌పోచంపల్లి మండలంలోని జలాల్‌పురంలో గల స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో 'లక్ష్య సాధనలో మనస్సు.. మానసికశక్తి' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో ఎన్ని అవరోధాలు ఏర్పడినా కుంగిపోకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలన్నారు. మెజీషియన్ రామకృష్ణ ప్రదర్శించిన కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వీరిని సంస్థ ప్రతినిధులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌టీఆర్ఐ సంస్థ డైరెక్టర్ సాయిలక్ష్మి, ఫ్యాకల్టీ వసంత రాణి, లలితారాణి, శైలజ, శ్రీనివాస్, దీప్తి, రాంకిషోర్, ఎస్.శ్రీనివాస్ రావు, వెంకటేశ్వర్లు, స్వామి, ఆలీ పాల్గొన్నారు.

### నాకు ఓటు వేస్తే ప్రజలను గెలిపిస్తా



మాట్లాడుతున్న ఎండీ జహంగీర్

మోటకొండూర్ : లోక్‌సభ ఎన్నికల్లో సుత్తికొడవలి నక్షత్రం గుర్తుకు ఓటు వేస్తే.. తానే ప్రజలను గెలిపిస్తానని సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి, జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ పేర్కొన్నారు. శుక్రవారం మోటకొండూరులో ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలే ఎజెండా పని చేస్తున్న తనక ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. ఇతర పార్టీలను అభ్యర్థులను నమ్మవద్దన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, బీజేపీకి ఓటు వేస్తే మతోన్మాదాన్ని పెంచి పోషిస్తారని ఆరోపించారు. అనంతరం స్థానిక మసీద్‌లో ముస్లింలకు ఇఫ్తార్‌విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సోషల్‌మీడియా రాష్ట్ర కన్వీనర్ జగదీష్, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి పానగంటి వెంకటేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కల్లూరి మల్లేషం, మండల కార్యదర్శి బొలగాని జయరాములు, కొల్లూరి అంజనేయులు, రేగు సిద్ధయ్య, కొమ్మగాని దశరథ, సీహెచ్ రోహన్, బండెల పోషయ్య, బోగ రమేష్, ఉపేందర్, వెంకటేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

### పది రోజుల్లో రోడ్డు పనులు పూర్తి చేయాలి



మోత్కూరు వద్ద రోడ్డు పనులను పరిశీలిస్తున్న సీఈ మోహన్‌నాయక్

మోత్కూరు: పది రోజుల్లో రోడ్డు పనులు పూర్తి చేయకుంటే నువ్వు ఉండవ్.. నీ కంపెనీ ఉండదని తెలంగాణ స్టేట్ రోడ్స్ సీఈ మోహన్‌నాయక్ సీ-5 కాంట్రాక్టర్‌ను మందలించారు. శుక్రవారం మోత్కూరులో బీటీ రోడ్డు పనులు, మోత్కూరు నుంచి రాజన్నగూడెం వరకు చేపట్టిన రహదారి పనులను పరిశీలించారు. రోడ్డు పనులను అసంపూర్తిగా వదిలేయడంతో పాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరిగి ఇద్దరు వ్యక్తులు మరణించారు. సమస్యను స్థానికులు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి ఆదేశాలతో సీఈ రోడ్డు పనులను పరిశీలించారు. అక్కడే ఉన్న సూపర్‌వైజర్లను తీవ్రంగా మందలించారు. పది రోజుల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

| యాదాద్రి జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన గ్రామాలు | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| గ్రామం | గరిష్ఠం | | | | | | | | |
| బుజిలాపురం | 43.4 | యాదగిరిగుట్ట | 43.0 | జనగాం | 42.3 | జలాల్‌పూర్ | 41.2 | | |
| మర్యాల | 43.3 | నందనం | 42.7 | కొలనుపాక | 42.2 | పాముకుంట | 41.1 | | |
| ఆత్మకూర్(ఎం) | 43.2 | నారాయణపురం | 42.6 | రామన్నపేట | 42.2 | తూప్రాన్‌పేట్ | 41.1 | | |
| వలిగొండ | 43.2 | బొమ్మలరామారం | 42.5 | వెంకిర్యాల | 42.1 | వెల్లంకి | 41.0 | | |
| భువనగిరి | 43.1 | చౌటుప్పల్ | 42.5 | గొలనుకొండ | 42.0 | దత్తపగూడెం | 41.0 | | |
| | | గుండాల | 42.3 | అడ్డగూడూరు | 41.9 | | | | |

# భయపెడుతున్న ఎండ

## 43.4 డిగ్రీలకు పెరిగిన ఉష్ణోగ్రతలు



- జిల్లాలోని 20 ప్రాంతాల్లో 41 డిగ్రీలకు పైనే
- ఆరెంజ్ జోన్‌గా ప్రకటించిన వాతావరణ శాఖ
- అప్రమత్తమైన యంత్రాంగం
- వడదెబ్బ నివారణకు జాగ్రత్తలు, కార్యాచరణపై దృష్టి
- టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు

భువనగిరి, భువనగిరి టౌన్ : జిల్లాలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. ఉదయం నుంచే ఎండ తీవ్రత ఉంటుంది. ఏప్రిల్ మాసం ఆరంభం నుంచే భానుడు ప్రభావం చూపుతున్నాడు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. శుక్రవారం జిల్లాలో పగటి ఉష్ణోగ్రత 43.4 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. అత్యధికంగా మోత్కూరులో 43.4, బొమ్మలరామారం 43.3, ఆత్మకూర్(ఎం) 43.2, వలిగొండ 43.2, భువనగిరిలో 43.1 డిగ్రీలుగా రికార్డ్ అయ్యింది. మిగతా మండలాల్లోనూ 41 డిగ్రీలకు పైనే నమోదయ్యాయి. దీంతో అధికారులు యాదాద్రి జిల్లాను ఆరెంజ్ జోన్‌గా ప్రకటించారు.

### 50 డిగ్రీలకు పెరిగే అవకాశం

రెండు రోజుల్లో మరో 2 నుంచి 4 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొనడంతో యంత్రాంగం అప్రమత్తం అయ్యింది. ప్రజలు వడదెబ్బకు గురికాకుండా అవగాహన కల్పించాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. మున్సిపాలిటీలు, పంచాయతీల్లో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. వేసవిలో వచ్చే వ్యాధులపై దృష్టి సారించాలని వైద్యారోగ్య శాఖకు సూచించారు. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని ప్రజలకు సూచించారు.

### టాస్క్‌ఫోర్స్ కమిటీ..

ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు, ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకునేందుకు జిల్లా స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశారు. ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా అవగాహన కల్పించాలని నిర్ణయించారు. పని ప్రదేశాల్లో కూలీలకు తాగునీరు, నీడ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఉపాధిహామీ పథకం కూలీలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ సౌకర్యం క్పించాలని, మూగ జీవాల కోసం నీటి తొట్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.



భూదాన్‌పోచంపల్లిలో రోడ్డుపై నిలిచిన నీటిని తాగుతున్న వానరాలు

**ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాం**



ఎండ తీవ్రత పెరిగింది. అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దు. వృద్ధులు, చిన్నారులను జాగ్రత్తగా చూసుకోవాలి. అన్ని శాఖల సమన్వయంతో వడదెబ్బ నివారణ చర్యలు చేపడుతున్నాం అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచాం. వడదెబ్బ బారిన పడిన వారు వెంటనే ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందాలి. మజ్జిగ, నిమ్మరసం, బొబ్బరి నీళ్లు ఎక్కువగా తీసుకోవాలి.

– డాక్టర్ వై.పాపారావు, డీఎంహెచ్ఓ

### వడదెబ్బ లక్షణాలు

డీహైడ్రేషన్, వాంతుల, విరేచనాలు, శరీర ఉష్ణోగ్రతలు పెరగడం, చెమట పట్టకపోవడం, వణుకు పుట్టడం, మగత నిద్ర లేదా కలవరింత, ఫిట్స్ లేదా పాక్షికంగా అపస్మార స్థితికి వెళ్లడం వడదెబ్బ లక్షణాలు. వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు తగ్గిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

**వడదెబ్బకు గురైతే ఇలా చేయాలి**

- వడదెబ్బకు గురైన వ్యక్తులను వెంటనే చల్లని ప్రదేశానికి తరలించాలి. చల్లని నీటిలో ముంచిన తడిగుడ్డతో శరీరం తుడవాలి. ఫ్యాన్ గాలి, చల్లని గాలి తగిలేలా చూడాలి. ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్ ద్రావణం తాగించాలి. వాంతులు, విరేచనాలు వంటివి సంభవించినా వైద్యులను సంప్రదించాలి. అపస్మారక స్థితిలోకి వెళ్లిన రోగికి నీరు తాగించవద్దు. వీలైనంత త్వరగా దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స చేయించాలి.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవీ..**

- ఉదయం, సాయంత్రం సమయాల్లోనే బయటకు వెళ్లాలి.
- బయటికి వెళ్లినప్పుడు పలుచని, వదులుగా ఉండే వస్త్రాలు ధరించాలి.
- రోజుకు కనీసం 15 గ్లాసుల నీటిని తాగాలి.
- పళ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి.
- రోడ్లపై ఉండే చల్లని రంగు పానీయాలు తీసుకోద్దు.
- భోజనం మితంగా తీసుకోవాలి. మాంసాహారం తీసుకోవద్దు.
- రోడ్లపై ఉండే కలుషిత ఆహారం తీసుకోవద్దు. మద్యం సేవించవద్దు.
- ఇంటిని ఫ్యాన్ వేసి చల్లగా ఉంచుకోవాలి.

## జగ్జీవన్‌రామ్‌కు నివాళి



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న అదనపు కలెక్టర్లు బెన్‌షాలోమ్, గంగాధర్

భువనగిరిటౌన్ : బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం భువనగిరిలోని ఆయన విగ్రహానికి అదనపు కలెక్టర్లు బెన్ షాలోమ్, గంగాధర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ అమరేందర్, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి జయపాల్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్యాంసుందర్, మున్సిపల్ కమిషనర్ రామాంజులరెడ్డి, కలెక్టరేట్ ఏఓ జగన్మోహన్‌ప్రసాద్, తహసీల్దార్ వెంకటరెడ్డి, అధికారులు పాల్గొన్నారు

## 15 నుంచి సమ్మేటీవ్ – 2 పరీక్షలు

- తేదీల్లో మార్పు చేసిన విద్యాశాఖ

భువనగిరి : ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 1నుంచి 9వ తరగతి వరకు నిర్వహించవలసిన సమ్మేటీవ్ -2 పరీక్ష తేదీల్లో మార్పులు చేశారు. ఈ మేరకు విద్యా శాఖ డైరెక్టర్ రాధారెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 8నుంచి 20వ తేదీ వరకు నిర్వహించాలని తొలుత నిర్ణయించగా.. 15 నుంచి 22వ తేదీ వరకు మార్పు చేశారు. 1 నుంచి 7వ తరగతికి ఉదయం 9గంటల నుంచి11.30 వరకు, 8వ తరగతికి 9 గంటల నుంచి 11.45వరకు, 9వ తరగతి విద్యార్థులకు 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. ఈనెల 23న పరీక్ష పత్రాల మూల్యాంకనం పూర్తి చేసి ఫలితాలను క్యూములేటివ్ రికార్డుల్లో నమోదు చేయనున్నారు. అలాగే తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి విద్యార్థుల పురోగతి రికార్డులు అందజేసి వాటిపై సంతకాలు తీసుకోనున్నారు.

## హామీల అమలులో ప్రభుత్వం విఫలం



భువనగిరిలో బీజేపీ నిర్వహించిన సత్యాగ్రహ దీక్షలో మాట్లాడుతున్న కాసం వెంకటేశ్వర్లు, పాల్గొన్న నాయకులు

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు

భువనగిరి : కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు విమర్శించారు. శుక్రవారం భువనగిరిలోని వినాయక చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో రైతు సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ, రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని ప్రకటించిందని, ఇప్పటి వరకు అమలు చేయలదేన్నారు. హామీలు అమలు చేకపోతే పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు.రాష్ట్ర కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి పడమటి జగన్‌మోహన్ రెడ్డి మాట్లాడుతూ రైతు కూలీలకు రూ.12 వేలు, కౌలు రైతులకు రూ.15 వేలు, వరికి బోనస్ కింద రూ.500 వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఫక్కీర్ రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మాయ దశరథ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్, ఉట్కూరి అశోక్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతంశెట్టి రవీందర్, పడాల శ్రీనివాస్, పట్నం శ్రీనివాస్, మొగులయ్య, అబ్బయ్య, కపిల్, కిష్టయ్య, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు, కార్యదర్శులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## ‘జనజాతర’ను జయప్రదం చేయాలి



తుక్కుగూడ బహిరంగ సభ డోర్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, నాయకులు

- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

సాక్షి,యాదాద్రి : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని తుక్కుగూడలో తలపెట్టిన తెలంగాణ జనజాతర బహిరంగ సభకు పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం భువనగిరిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు తుక్కుగూడలోనే సభ నిర్వహించి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చామని, ఇప్పుడు రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయడం కోసం తుక్కుగూడలో మారోమారు సభ నిర్వహిస్నట్లు తెలిపారు. ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖార్గే, అగ్రనాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ హాజరవుతున్నట్లు చెప్పారు. ఈ సభలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఐదు న్యాయాలు, 25 గ్యారంటీలతో మేనిఫెస్టో విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. భువనగిరి ఎంపీ స్థానాన్ని భారీ మెజార్టీతో కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. భువనగిరి మండలం ముత్తిరెడ్డిగూడెం శివారులో 10 ఎకరాల విస్తీర్ణంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే బీబీనగర్‌లో నిమ్స్ ఆస్పత్రికి ప్రారంభమైందని పేర్కొన్నారు. భువనగిరి మున్సిపాలిటీ అభివృద్ధి కోసం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో మాట్లాడి రూ.4 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. భూదాన్‌పోచంపల్లిని హెరిటేజ్ గ్రామంగా ప్రకటించారని, చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ చైర్మన్ పొత్తంశెట్టి వెంకటేశ్వర్లు, భువనగిరి ఎంపీపీ నరాల నిర్మల, నాయకులు కూర వెంకటేష్, బీసు కుంట్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

### 7న కవి సమ్మేళనం

భువనగిరి టౌన్ : శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు ఈనెల 7న భువనగిరి పరిధి రాయగిరిలో గల సోమ రాధాకృష్ణ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు జిల్లా రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం నరసింహారెడ్డి, డాక్టర్ పోరెడ్డి రంగయ్య, మెరుగు సదానందం, బండారు జయశ్రీ శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. అతిథులుగా ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఎన్.గోపి, పద్మశ్రీ డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య, డాక్టర్ పెసర వేణుగోపాల్‌రెడ్డి, ఎస్ఎన్ చారి, కస్తూరి లక్ష్మీనారాయణ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. కవులు, కవయిత్రులు సాహితీ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## కాంగ్రెస్ సమావేశంలో రభస

- పార్టీకోసం కష్టపడినా గుర్తింపులేదని సీనియర్ నాయకుల ఆగ్రహం
- మండల, పట్టణ అధ్యక్షులతో వాగ్వాదం



యాదగిరిగుట్ట మండల, పట్టణ అధ్యక్షులతో వాగ్వాదానికి దిగిన నాయకులు

యాదగిరిగుట్ట : పార్టీ కోసం కష్టపడిన వారికి సరైన గుర్తింపు ఇవ్వడం లేదని, అధికారంలో లేకున్నా పదేళ్ల పాటు పార్టీకి వెన్నుదన్నుగా నిలిచామని, అధికారంలోకి వచ్చిన తరువాత తమను విస్మరిస్తున్నారని పలువురు సీనియర్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. తుక్కుగూడ బహిరంగ సభ నేపథ్యంలో శుక్రవారం యాదగిరిగుట్ట పట్టణంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశం రసాభాసగా మారింది. యాదగిరిగుట్ట పట్టణ, మండల అధ్యక్షులు బందారపు భిక్షపతి, కానుగు బాలరాజుగౌడ్ మాట్లాడుతున్న సమయంలో యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన మిట్ట రాంచందర్, గుండ్లపల్లి కరణ్, పెలిమెల్లి చిన్న వెంకట్‌తో పాటు మరికొందరు సీనియర్ నాయకులు, కార్యకర్తలు వారి ప్రసంగానికి అడ్డుతగిలారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు అహర్నిశలు కృషి చేశామని, ఇప్పుడు తమను పట్టించుకోవడం లేదన్నారు. సభలకు జనసమీకరణ చేసేటప్పుడు, పార్టీ జెండాలను కట్టేటప్పుడు మాత్రమే తాము గుర్తుకు వస్తామా..? అని ప్రశ్నించారు. కొత్త చేరిన వారికి ఇచ్చిన ప్రాధాన్యం కూడా తమకు ఇవ్వలేరని మండిపడ్డారు. ఈ క్రమంలో యాదగిరిగుట్ట పట్టణ, మండల అధ్యక్షులతో వాగ్వాదానికి దిగారు. ఎంపీపీ చీర శ్రీశైలం జోక్యం చేసుకొని వారిని సముదాయించారు. పొరపాట్లు జరగకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో సద్దుమణిగారు.

## సగానికి పైగా సిజేరియన్‌లే..!

- ప్రైవేట్ ఆస్పత్రులకు కాన్పుకెళ్తే కోతలు
- సంపాదనే లక్ష్యంగా నిర్వాహకులు
- మూడు నెలల్లో 124 సాధారణ, 421 సిజేరియన్ కాన్పులు



భువనగిరి : జిల్లాలో సాధారణ కాన్పుల కంటే సిజేరియన్ డెలివరీలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. నార్మల్ డెలివరీకి అవకాశం ఉన్నా సంపాదనే లక్ష్యంగా చాలా ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు గర్భిణులకు సిజేరియన్లు చేస్తున్నాయి. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, డెలివరీ సమయంలో గర్భిణులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేస్తున్నా అధికారులు, ప్రైవేట్ వైద్యులు పట్టించుకోవడం లేదు.

### ప్రతి పది మందిలో ఏడుగురికి సిజేరియన్

ప్రైవేట్ ఆస్పత్రులకు కాన్పుకు వెళ్లే ప్రతి 10 మందిలో ఏడుగురికి సిజేరియన్ చేస్తున్నారు. 2022లో ప్రైవేట్ ఆస్పత్రుల్లో 10,500 ప్రసవాలు జరగగా ఇందులో 85 శాతానికి పైగా సిజేరియన్ ద్వారా కాన్పులు చేశారు. 2023లో 68 శాతానికి పైగా సిజేరియన్లు అయ్యాయి. 8,734 కాన్పులకు 1,100 మాత్రమే సాధారణ ప్రసవాలు జరిగాయి. ఈ ఏడాది మార్చి వరకు ప్రైవేట్‌లో నార్మల్ 124, సిజేరియన్ కాన్పులు 421 జరిగాయి. శస్త్రచికిత్సలు తగ్గించి సాధారణ ప్రసవాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నా ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు ఖాతరు చేయడం లేదు. ఫలితంగా తల్లులకు కోతలు తప్పడం లేదు.

**2023లో కాన్పులు ఇలా..**

| ఆస్పత్రి | నార్మల్ | సిజేరియన్ |
|---|---|---|
| ప్రభుత్వ | 5,486 | 6,434 |
| ప్రైవేటు | 1100 | 7,634 |
| **2024లో మార్చి వరకు** | | |
| ప్రభుత్వ | 534 | 454 |
| ప్రైవేట్ | 124 | 421 |

**అవగాహన కల్పిస్తున్నాం**

ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు ప్రైవేట్‌లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచేలా అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు గ్రామాల్లో ఆశ కార్యకర్తల ద్వారా సాధారణ కాన్పుల ప్రాముఖ్యతను వివరించేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రైవేట్ ఆస్పత్రుల్లో కూడా సాధారణ ప్రసవాల సంఖ్య పెంచేలా నిర్వాహకులతో సమీక్ష నిర్వహిస్తాం.

– పాపారావు, డీఎంహెచ్ఓ

### ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ కాన్పులు ఎక్కువ

జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు పెరిగాయి. 2022 సంవత్సరం కంటే 2023 లో 45 శాతానికి పైగా నార్మల్ డెలివరీలు పెరిగాయి. అయితే ఈ ఏడాది సాధారణ కాన్పుల సంఖ్య కొంత తగ్గే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి మార్చి వరకు సాధారణ కాన్పులు 534, సిజేరియన్‌లు 454 జరిగాయి.

## నృసింహుడికి లక్ష పుష్పార్చన



ఉత్సవమూర్తులకు లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న ప్రధానార్చకుడు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో లక్షపుష్పార్చన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రధానాలయ ముఖమండపంలో ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలతో దివ్యమనోహరంగా అలంకరించారు. అర్చకులు, వేద పండితులు సహస్రనామ పఠనాలు పఠిస్తూ వివిధ రకాల పూలతో లక్ష పుష్పార్చన చేశారు. తెల్లవారుజామున సుప్రభాత సేవ, నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఉదయం సుదర్శన నారసింహ హోమం, నిత్యకల్యాణం తదితర పూజలు నిర్వహించారు.